# కాంగ్రెస్ ఎమ్మెల్యేల పని తీరు పూర్

**ఉమ్మడి జిల్లాలో మంత్రులు మినహా అందరూ అంతే..**


భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డికి 101వ ర్యాంకు
దేవరకొండ ఎమ్మెల్యేకు 85.. మిర్యాలగూడ ఎమ్మెల్యేకు 84
73వ ర్యాంకు వద్ద తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్
మెరుగైన స్థానంలో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
పీపుల్స్ పల్స్–సౌత్ ఫస్ట్ సర్వేలో స్పష్టం.. సోషల్ మీడియాలో చక్కర్లు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేల పనితీరు ఏమీ బాగాలేదు.. ఇది జనం మాట. ఏడాదిన్నర కాలంలో అధిక శాతం మంది శాసనసభ్యుల పెర్ఫార్మెన్స్ చాలా పూర్‌గా ఉంది. ఎమ్మెల్యేలు పాలన, పనితనంలో వెనకంజలో ఉన్నారు. టాప్–20 ఇద్దరు మాత్రమే చోటు దక్కించుకున్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఏకంగా 101వ ర్యాంకులో ఉన్నారు. పీపుల్స్ పల్స్–సౌత్ ఫస్ట్ సంస్థలు విడుదల చేసిన సర్వేలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. అవిప్పుడు సోషల్ మీడియాలోవ వైరల్ అవుతున్నాయి.

### సర్వే తీరు ఇలా..

పీపుల్స్ పల్స్ – సౌత్ ఫస్ట్ అనే సంస్థలు సంయుక్తంగా మార్చి 28 నుంచి ఈ నెల 3 వరకు 118 (సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం మినహాయించి)నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే చేశాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 450 నుంచి 500 నమూనాలను కంప్యూటరైజ్డ్ అసిస్టెడ్ టెలిఫోనిక్ ఇంటర్వ్యూస్ ద్వారా సేకరించాయి. ఇందులో పురుషులు, మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 11 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న విషయం తెలిసిందే.

**ఎమ్మెల్యేల పని తీరు ఎలా ఉంది? అనే ప్రశ్నకు ఎంత శాతం మంది ఎలా స్పందించారంటే...**




### మెరుగైన స్థానంలో జగదీశ్‌రెడ్డి



అధికార ఎమ్మెల్యేతో పోలిస్తే మాజీ మంత్రి, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మెరుగైన స్థానంలో నిలిచారు. ఉమ్మడి నల్లగొండలో మంత్రులు, ప్రభుత్వ విప్ తర్వాత తన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయనకు 37వ స్థానం దక్కింది.



### మంత్రులు మాత్రమే..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నారు. హుజూర్‌నగర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి 9వ స్థానంలో నిలిచారు. 44.3శాతం మంది ఈయన పనితీరు బాగుందని, 38.0శాతం బాగాలేదని వెల్లడించారు. 11.2శాతం మంది ఫర్వాలేదని, 6.6శాతం మంది ఏమీ చెప్పలేమని పేర్కొన్నారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 17ర్యాంకు వద్ద ఉన్నారు. 41.8శాతం మంది ఈయన పని తీరు బాగుందని, 39.2శాతం బాగాలేదని తెలిపారు. 11.3 శాతం మంది ఫర్వాలేదని, 7.7శాతం మంది ఏమీ చెప్పమలేని స్పష్టం చేశారు.

### 101వ ర్యాంకులో భువనగిరి ఎమ్మెల్యే



సర్వే ఫలితాల ప్రకారం ఉమ్మడి నల్లగొండ ఎమ్మెల్యేల పని తీరును పరిశీలిస్తే.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పెర్ఫార్మెన్స్ చాలా పూర్‌గా ఉంది. ఆయన ఏకంగా 101 ర్యాంకు వద్ద ఉన్నారు. ఎమ్మెల్యే పని తీరు 36.9 శాతం మంది బాగుందని, 49.3 శాతం మంది బాగా లేదని, 7.5 శాతం మంది ఫర్వాలేదని చెప్పారు. 6.3శాతం మంది ఏదీ చెప్పలేదు.

# ఉచిత విద్యుత్ ఉత్తదే

**• 199 యూనిట్లకు రూ.1,163 బిల్లు • వినియోగదారుడి ఆవేదన**



విద్యుత్ బిల్లు వివరాలు చూపిస్తున్న రఫీ

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ ఉచిత విద్యుత్ హామీ మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. తాము అధికారంలోకి వస్తే గృహ వినియోగ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వినియోగదారులు మొండిచెయ్యి చూపుతున్నది. ఉచిత విద్యుత్ అమలు కోసం ప్రారంభంలో మార్గదర్శకాలను విడుదల చేసి తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఫ్రీ కరెంట్ ఇస్తామని ప్రకటించింది. అద్దె ఇండ్లల్లో ఉండేవారికి వర్తిస్తుందని తెలిపింది. మొదట్లో సమస్యలు ఉన్నా కొద్ది నెలలపాటు అమలు చేసింది. కానీ, తీరా ఎండ కాలం వచ్చేసరికి 200 యూనిట్లలోపు రీడింగ్ వచ్చిన వినియోగదారులకు కూడా బిల్లు వేస్తున్నది. నల్లగొండ జిల్లాకేంద్రంలోని రాక్ హిల్స్ కాలనీలో అద్దెకు ఉంటున్న మహ్మద్ రఫీకి కొన్ని నెలలుగా ఉచిత విద్యుత్ అందుతున్నది. ఇంత వరకు బాగానే ఉన్నా, మార్చి నెలకు సంబంధించి 30 రోజులకు గానూ 199 యూనిట్ల రీడింగ్ రాగా, విద్యుత్ సిబ్బంది రూ. 1,163 బిల్లు వేసి ఇచ్చారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పింది కదా విద్యుత్ సిబ్బందిని ప్రశ్నిస్తే సరైన సమాధానమే లేదని రఫీ వాపోతున్నాడు.


నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I నల్లగొండ, ఆదివారం 6 ఏప్రిల్ 2025 YADADRI BHUVANAGIRI


## కోదాడ పోలీస్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం



కోదాడ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో అలుముకున్న మంటలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 5 : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. స్టేషన్ పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో రవ్వలు ఎగిసిపడి స్టేషన్ ప్రాంగణంలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు అంటుకున్నాయి. పోలీసుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో స్టేషన్ యార్డులోని మూడు ఆటోలు, ఒక సుమో, కారు, ట్రాలీ ఆటో పాక్షికంగా కాలాయి. స్టేషన్ పక్కనే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు ఉండడంతో మంటలు ఎగిసిపడిన సమయంలో ప్రజలు, పోలీసులు ఆందోళనకు గురయ్యారు. మంటలు అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, సూర్యాపేట, నల్లగొండ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, రమావత్ రవీంద్ర కుమార్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి

# రజతోత్సవం అదిరేలా...



**ప్రతి కార్యకర్త తరలివచ్చేలా ఏర్పాట్లు ఉండాలి**

## ఈ నెల 27 బహిరంగ సభకు పెద్దఎత్తున జనం

- వరంగల్ సభకు విస్తృత ప్రచారం కల్పించాలి
- పార్టీ నేతలంతా సమష్టిగా కృషి చేయాలి
- సభ అనంతరం సభ్యత్వ నమోదు.. కమిటీల ఏర్పాటు
- పార్టీ పటిష్టతే లక్ష్యంగా సంస్థాగత నిర్మాణం
- ఉమ్మడి జిల్లా నేతలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం



కేసీఆర్‌తో యాదాద్రి భువనగిరి జిల్లా నేతలు బూడిద భిక్షమయ్యగౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబరాలు అంబరాన్ని అంటేలా, చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా నిర్వహించనున్నట్లు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. అందుకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఇందులో వరంగల్‌కు ఆనుకుని ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పెద్ద ఎత్తున భాగస్వామ్యం ఉండాలని, ఆ మేరకు పార్టీ నేతలంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ నెల 27న వరంగల్ శివారులో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి భారీ స్పందన వస్తున్నదని కేసీఆర్ తెలిపారు. స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు అంతా సిద్ధమవుతున్నారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఉమ్మడి జిల్లా నేతలకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన పార్టీ ముఖ్యులతో కేసీఆర్ సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవాల ప్రాధాన్యతను కేసీఆర్ వివరిస్తూ క్షేత్రస్థాయి వరకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ నెల 27 వరకు వరంగల్ సభ సక్సెస్ కోసం చేపట్టాల్సిన కార్యాచరణను వివరిస్తూ నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు నిర్వహించాలన్నారు. ఇందులోనే మండలాలు, గ్రామాల వారీగా సభకు తరలివచ్చే జనంపైన అంచనాలు రూపొందించుకుని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రవాణాకు అవసరమైన వాహన ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు స్థానికంగా అందుబాటులో ఉన్న ఇతర వాహనాలను ముందే బుక్ చేసి పెట్టుకోవాలని సూచించారు. వేసవి కావడంతో ఎండ తీవ్రత దృష్ట్యా సభకు తరలివచ్చేవారు ఇబ్బంది పడకుండా తాగునీరు, భోజనం ఏర్పాట్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వచ్చే వారంతా మధ్యాహ్నం 3 గంటల వరకు సభా ప్రాంగణంలో ఉండేలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వరంగల్‌కు దగ్గరగా ఉండే ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి 10వేల మందికి తగ్గకుండా, దూరంగా ఉన్న ఇతర నియోజకవర్గాల నుంచి 5వేలకు తగ్గకుండా జనం తరలివచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామాలు, వార్డుల్లో బహిరంగ సభకు వచ్చే ముందు రజతోత్సవ వేడుకల ఆరంభ సూచికంగా అన్ని చోట్ల పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. వరంగల్ రజతోత్సవ సభ అనంతరం పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెడుదామని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు, నూతన కమిటీల ఏర్పాటు, పార్టీ క్యాడర్‌కు శిక్షణ తరగతులు తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తూ పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దుదామని చెప్పారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ సర్కారు రెండూ పాలనలో విఫలమయ్యాయన్న కేసీఆర్.. ప్రజలే నిలదీసే రోజులు వచ్చాయంటూ ప్రస్తుత పరిస్థితులను వివరించారు. రానున్న కాలంలో ప్రజల్లో మరింత వ్యతిరేకత పెరుగనుందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు మరింత విస్తృతంగా పార్టీ తరుపున ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోని పథకాల వారీగా పరిస్థితులను, నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని పథకాల పరిస్థితిని ప్రజలకు విడమర్చి చెప్పాలని పార్టీ ముఖ్యులకు దిశానిర్దేశం చేశారు. రజతోత్సవ సభ నేపథ్యంలో గత నెల 22నే అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్ భేటీ అయిన విషయం తెలిసిందే. దాంతో శనివారం నాటి సమావేశంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల బాగు కోసం మోహన్‌రెడ్డి కృషి

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**




గూడూరు మోహన్‌రెడ్డి సంతాప సభలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే పైళ్ల, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల

వలిగొండ, ఏప్రిల్ 5 : రైతుల బాగు కోసం గూడూరు మోహన్ రెడ్డి ఎంతో కృషి చేశారని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. వలిగొండ మండలంలోని ఏదుళ్లగూడెం గ్రామం లో శనివారం జరిగిన నీటి పారుదల శాఖ విశ్రాంత ఎస్ఈ మోహన్‌రెడ్డి సంతాప సభలో ఆమె పాల్గొన్నారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ 2006–07 సంవత్సరంలో శ్రీ వెంకటేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా 600 ఎకరాలకు సాగు నీరందించే బృహత్తర కార్యక్రమానికి మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రైతుల కోసం సొంత నిధులతోపాటు భూమిని కూడా దానం ఇచ్చి ఎత్తిపోతలను పూర్తి చేశారన్నారు. ఆయన కృషితో ఎదుళ్ల గూడెం గ్రామ రైతులకు నిరంతరాయంగా సాగు నీరందుతున్నదని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్తూ తిరుగు ప్రయాణంలో మండలంలోని టేకులసోమారం గ్రామంలో ఎండిన పంటలను పరిశీలించారు. రైతులతో రైతు మాట్లాడి ధైర్యం చెప్పారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని తెలిపారు. పంటలు ఎండిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఈఈలు శ్యాంసుందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సత్తిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మ వెంకట్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, పనుమటి మమత నరేందర్‌రెడ్డి, డేగల పాండరి పాల్గొన్నారు.

# రేవంత్ సర్కారులో ఏరులై పారుతున్న మద్యం

- ధనార్జనే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన
- బీఆర్‌ఎస్ పాదయాత్రను విజయవంతం చేయాలి
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 5 : ఉగాది పండుగ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 60 మద్యం దుకాణాలను ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా మద్యాన్ని ఏరులై పారించేందుకు ప్రయత్నాన్ని ముమ్మరం చేశారని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి విమర్శించారు. గ్రామాల్లో బెల్టు షాపులను తెరిచే ఉంటాయని ఎక్సైజ్ శాఖ అధికారులు బాహాటంగానే చెప్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ మండలాధ్యక్షులు, యువజన, విద్యార్థి విభాగాలు, సోషల్ మీడియా ఇన్‌చార్జీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ దేవస్థానం వరకు తలపెట్టిన పాదయాత్రపై అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేడో, రేపో పాదయాత్ర తేదీని ప్రకటిస్తామన్నారు. సుమారు వెయ్యి మందితో పాదయాత్ర ఉంటుందని, ఒక్కో మండలం నుంచి 200 నుంచి 250 మందికి వరకు పాల్గొనాలని కోరారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వైకుంఠ ద్వారం వద్ద ప్రారంభమైన మల్లాపురం మీదుగా తుర్కపల్లి మండల కేంద్రం, వాసాలమర్రి మీదుగా పాదయాత్ర సాగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ పాలనే రావాలని జనం కోరుకుంటున్నారని, ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ పాలనే బాగుందని గుర్తుచేస్తున్నారని వివరించారు. ఆదాయం పెంచుకోవాలన్న యావలో రేవంత్ సర్కారు బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లు ఎక్సైజ్ శాఖ నుంచి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుని బార్లు ప్రారంభించేందుకు సిద్ధమైందన్నారు. యువతకు మత్తులో దించి తాగుబోతులను చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. హామీలు, అభివృద్ధిని పక్కన పెట్టిన ధనార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, గంగుల శ్రీనివాస్, పొలగాని వెంకటేశ్‌గౌడ్, పిన్నపునేని నరేందర్‌రెడ్డి, సట్టు తిరుమలేశ్, బొట్ల యాదయ్య, ఎండీ ఖలీల్, బీసు చందర్‌గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, బీఆర్‌ఎస్వీ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ర్యాకల రమేశ్, సోషల్ మీడియా కన్వీనర్ నల్ల శ్రీకాంత్, వివిధ మండలాల యువజన విభాగం అధ్యక్షులు బీస కృష్ణంరాజు, ఎండీ అజ్జు, సందిళ్ల భాస్కర్‌గౌడ్, పన్నాల నవీన్‌రెడ్డి, ముక్యర్ల సతీశ్ యాదవ్, విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఒగ్గు మల్లేశ్, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మిట్ట వెంకటయ్యగౌడ్, శారాజీ రాజేశ్‌యాదవ్, బాలరాజు పాల్గొన్నారు.



